క్లుప్తంగా

మహా కుంభమేళాకు ప్రత్యేక బస్సు సర్వీసు

ఆర్టీసీ డీఎం వైవీవీఎస్ కుమార్ వెల్లడి

కొవ్వూరు: ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో నిర్వహిస్తున్న మహాకుంభ మేళాకు కొవ్వూరు డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. ఏడు రోజుల పాటు కొనసాగే ఈ యాత్రలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి అల్పాహారంతో కలిపి ఒక్కో మనిషికి రూ.10వేల టికెట్ ధర నిర్ణయించామన్నారు. మార్గ మధ్యంలో భువనేశ్వర్, పూరి, కోణార్క్, ప్రయాగ్ రాజ్‌లో ఒక బస ఉంటుందన్నారు. కుంభమేళా, వారణాసి(ఒక రోజు బస ఉంటుంది), గయ, బుద్ధ గయ, అరసవిల్లి, శ్రీకూర్మం, త్రివేణి సంగమం, విశ్వనాథ దర్శనం ఉంటాయని వివరించారు. బస్సుకు సరిపడా యాత్రికులు ఉన్నట్లయితే అదే గ్రామానికి బస్సు పంపిస్తామన్నారు. భక్తులు ఎక్కడ ఉన్నారనేది ఎప్పటి కప్పుడు సమాచారం తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించామన్నారు. ఈ యాప్‌ను బస్సు బయల్దేరే సమయంలో ఇన్‌స్టాల్ చేయనున్నట్లు డీఎం తెలిపారు. ఆసక్తి గలవారు 81215 82849 నంబరును సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి పశు వైద్య శిబిరాలు

పెరవలి: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 20 నుంచి 31 వరకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి చరణ్ ఫణీంద్ర కోరారు. మండలంలోని కాపవరం గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడి రైతులు తమ పశువులను వైద్య శిబిరాలకు తీసుకువచ్చి వ్యాధులకు చికిత్స తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు సల్మా, పశువైద్య సిబ్బంది రమేష్, సోమేశ్వరి, నాయకులు నందిప శ్రీనివాస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

నిడదవోలు రూరల్: భవిష్యత్ తరాలు రోగాల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయమే పరిష్కార మార్గమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు అన్నారు. మండలంలోని కలవచర్ల గ్రామంలో 50 ఎకరాల వరి పంటలపై డ్రోన్ సహాయంతో ప్రకృతి వ్యవసాయ కషాయాలు, ద్రావణాలను కలిపి సోమవారం పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ, సిబ్బంది పురుషోత్తం, నాగసుశీల, విజయలక్ష్మి, సత్యనారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన పూలే, అంబేడ్కర్ ముఖ చిత్రాలతో కూడిన డైరీని సోమవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మ గౌరవం, సమానత్వం, కుల వివక్ష నిర్మూలన కోసం కేవీపీఎస్ చేస్తున్న కృషి అభినందనీయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి బి.అరుణ్, ఐద్వా జిల్లా కార్యదర్శి తులసి, సీఐటీయూ నాయకురాలు దయామణి, జువ్వల రాంబాబు, మద్దిపాటి ఫణీంద్ర, గోపీ యాదవ్, ప్రభాకర్, సురేష్, రాజేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: అనారోగ్య సమస్యలతో వైద్య సేవలు పొంది సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న తాళ్లపూడి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం మంజూరైన చెక్కులు అందజేశారు. తాళ్లపూడికి చెందిన పడాల నాగ సతీష్‌కు రూ. 49,937, చిట్టాల నాగ సత్యనారాయణకు రూ. 85,561ల నగదు సాయం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైంది. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఎన్డీఏ కూటమి నాయకులు నామన పరమేశ్వరరావు, ఇందుగుల రామకృష్ణ, ఉడతా వీరేంద్ర, నామా చినసత్య నారాయణ, ఆటపాకుల సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు పోతే కష్టాలే!



నిడదవోలు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం



అట్లపాడులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల్లో ట్రాన్స్‌కో సిబ్బంది (ఫైల్)

- సబ్‌స్టేషన్ల పరిధిలో వేధిస్తున్న లైన్‌మెన్‌ల కొరత
- ప్రైవేటు వర్కర్లతోనే పనులు
- అవస్థలు పడుతున్న పల్లె గ్రామాల ప్రజలు

నిడదవోలు రూరల్: అనుకోని సమస్యలు తలెత్తి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే గ్రామాలు అంధకారంలో కొట్టుమిట్టాడే దుస్థితి నెలకొంది. సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో కరెంట్ పోతే పలు ప్రాంతాల్లో గంటల పాటు చీకటి రాజ్యమేలుతోంది. నిడదవోలు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిధిలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో లైన్‌మెన్‌ల కొరత వేధిస్తోంది. దీంతో పల్లె గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నారు. సమస్య తలెత్తితే ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారు. వర్షాకాలంలో ఈదురు గాలులతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతుండడంతో ప్రజలు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా లైన్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యుత్ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

నియోజకవర్గంలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు..

సబ్‌స్టేషన్లు	గృహాలు	పరిశ్రమలు	వ్యవసాయ కనెక్షన్లు
నిడదవోలు పట్టణం	17,642	422	238
నిడదవోలు మండలం	9,348	342	1727
పురుషోత్తపల్లి	14,276	464	1517
మోర్త	28,015	673	1809
పెరవలి	24,461	780	2086
మొత్తం	93,742	2681	7377

పట్టించుకునేవారే లేరు

నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం, మండలం, మోర్త, పెరవలి, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో 1,03,800 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, విద్యుత్ లైన్ల పర్యవేక్షణలో కీలకపాత్ర పోషించే లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిడదవోలు మండలంలోని 23 గ్రామాల్లో శెట్టిపేట, గోపవరం, జీడిగుంట, మునిపల్లి, సమిశ్రగూడెం, సూరాపురం, ఉనకరమిల్లి, కాటకోటేశ్వరం, శంకరాపురం, తాడిమళ్ల, రావిమెట్ల గ్రామాల్లో పూర్తిస్థాయిలో లైన్‌మెన్లు లేరు. గత ఏడాదిగా వివిధ గ్రామాలకు చెందిన లైన్‌మెన్‌లు బదిలీపై వెళ్లడంతో పక్క గ్రామాల్లోని సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్‌-2 జేఎల్ఎంలు మాత్రమే సేవలందిస్తున్నారు. ప్రధాన లైన్‌మెన్‌లు లేకపోవడంతో బ్రేక్ డౌన్ అయినా, విద్యుత్ సరఫరా ఆగి, సరఫరాలో అంతరాయం కలిగినా పట్టించుకునేవారే లేరు. ఉదయం పూట ఒక్కసారి కరెంట్ పోతే ఐదారు గంటల వరకు కరెంట్ రాని రోజులెన్నో ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. కరెంట్ కోతల ప్రభావంతో గ్రామాల్లో తాగునీటి సరఫరా సమస్య సైతం వేధిస్తోంది. తమ సమస్యలు చెప్పుకొందామని సబ్‌స్టేషన్లకు ఫోన్‌చేస్తే లైన్‌మెన్‌లు అందుబాటులో లేరనే సమాధానం అక్కడ ఉన్న సిబ్బంది నుంచి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేరమని తెలిసినా..

గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తితే ప్రతి ఒక్కరూ ప్రైవేటు వర్కర్లపై ఆధార పడాల్సిన పరిస్థితి తలెత్తింది. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు పోవడం, కరెంట్ పోల్ వద్ద జంపర్లు కట్ కావడంతో పాటు చెట్ల వద్ద విద్యుత్ తీగలు అతుక్కుపోయి విద్యుత్ సరఫరాలో బ్రేక్ డౌన్ అవుతోంది. దీంతో సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉన్న ప్రైవేట్ వర్కర్లను ఆశ్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం విద్యుత్‌శాఖలో ప్రైవేట్ వర్కర్లతో పని చేయించడం నేరమని తెలిసినా తప్పని పరిస్థితుల్లో ట్రాన్స్‌కో సిబ్బంది వారి సహాయం తీసుకుంటున్నారు. గతంలో చిన్నపాటి పొరపాట్లతో కరెంట్ షాక్‌కు గురై పలువురు మృతి చెందగా, విద్యుత్ స్తంభాలపై నుంచి కింద పడి కాళ్లు, చేతులు పోగొట్టుకుని వికలాంగులుగా మారిన వారు సైతం ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో లైన్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్నాం

> నిడదవోలు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్లలో వివిధ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా, బ్రేక్ డౌన్‌తో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా అందుబాటులో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా చేయిస్తున్నాం. లైన్‌మెన్‌ల కొరత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.
>
> – ఎస్.నారాయణ అప్పారావు, ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, నిడదవోలు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్డీవో రాణి సుస్మిత



కొవ్వూరులో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత



మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, అధికారులు

కొవ్వూరు: అర్జీదారుల సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తొమ్మిది అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. లబ్ధిదారులు వ్యయ ప్రయాసలతో ఆర్డీవో కార్యాలయానికి రానవసరం లేదని మండల స్థాయి కార్యాలయాల్లో సైతం ఫిర్యాదులు అందజేయవచ్చునని సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండల స్థాయి అధికారులంతా అందుబాటులో ఉంటారని అన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి తగు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి జి.జవహర్ బాజీ, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు : ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులకు సూచించారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అధికారులతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. పలు సమస్యలపై 33 మంది ఫిర్యాదులు అందజేశారు. సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పెద్దేవం గ్రామంలోని సుఘంది చెరువును అభివృద్ధి చేయాలని, అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్య కోర్టుకు వెళ్లడంతో గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయం పోయిందని స్థానికులు బోడపాటి కాశీ, నామన బులి రాజు, జమ్ముల శ్రీను తదితరులు ఫిర్యాదు చేశారు. ఎస్సీ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ హాలుతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని అదే గ్రామానికి చెందిన గెడ్డం విజయ భాస్కర్ ఎమ్మెల్యేను కోరారు. ప్రక్కిలంక పంచాయతీ పరిధిలోకి వచ్చే పైడిమెట్టకు చెందిన పలువురు గ్రామస్తులు పైడిమెట్ట ఎత్తి పోతల పథకం కాలువ గట్టును పక్కనే ఉన్న ఫంక్షన్ హాల్ యాజమాన్యం ఆక్రమించుకున్నారని, కాల్వగట్టు లేక రైతులకు ఇబ్బంది కలుగుతోందని ఆక్రమణలు తొలగించాలని దేవరపల్లి రవి తదితరులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ మోహన భారతి, ఈవోపీఆర్డీ కేవీఎస్ వీరన్న, టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, బీజేపీ మండలాధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుడి ఫిర్యాదు వింటున్న తహసీల్దార్ అచ్యుత కుమారి

న్యాయం చేయండి

పెరవలి: ప్రభుత్వ స్థలం నుంచి నేరుగా తన ఇంటిలోకి దారి ఉందని ఓ వ్యక్తి తనపై దుర్భాషలాడటమే కాక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తనకు న్యాయం చేయాలని నడుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికారుల వద్ద తనగోడు వెళ్లబోసుకున్నాడు. పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ వేదికలో 4 ఫిర్యాదులు వచ్చాయని వీటిలో రెండు సర్వే కోసం, మరో రెండు మ్యుటేషన్ కోసం వచ్చాయని అధికారులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అచ్యుత కుమారి కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



మారెళ్లమూడిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది



పశు వైద్యశిబిరంలో సూచనలిస్తున్న కొవ్వూరు ఏడీఏ డాక్టర్ వెంకటరెడ్డి

నల్లజర్ల: పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఇన్‌చార్జ్ ఏడీఏ శామ్యూల్ రైతులకు సూచించారు. సోమవారం మారెళ్లమూడిలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు అందించారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో పశువులు బరువు పెరిగి ఆరోగ్యంగా ఉండటంతో పాటు పాల ఉత్పత్తి పెరగడం, పునరుత్పత్తి పెరుగుతుందని వ్యాధి నిరోధకశక్తి పుంజుకుంటుందని వివరించారు. చిన్నగోకులం షెడ్లు, బహువార్షిక పశుగ్రాస క్షేత్రాలు, పశుబీమా, పశుకిసాన్, క్రెడిట్ కార్డులు, సంచార పశుఆరోగ్య సేవా వాహనాలు, లింగ నిర్ధారిత వీర్యం, పిండ మార్పిడి పరిజ్ఞానం తదితర పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. డీవార్మింగ్ బాటిల్స్, కాల్షియం పౌడర్, పౌల్ట్రీ వ్యాక్సిన్ పౌడరు అందజేశారు. కార్యక్రమంలో బి.రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి

చాగల్లు: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ కొవ్వూరు ఏడీఏ డాక్టర్ ఏ.వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని చాగల్లు, నెలటూరు గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాలను నిర్వహించారు. పశువులు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువులకు వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ యు.ముఖేష్, సర్పంచ్ ఉమారజిని, నాయకులు తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్, శ్రీనివాసరావు, కేశవరావు, నందిగం శ్రీను, పాడి రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలి

రాజమహేంద్రవరం రూరల్: గత ఏడాది జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో విధులు నిర్వహించిన ఉద్యోగులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ్మూర్తిని యూటీఎఫ్ జిల్లా సంఘం కోరింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓను కలిశారు. ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరడంతో పాటు కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో ఆర్‌పీఎస్ 2022 ప్రకారం 16 శాతం హెచ్‌ఆర్‌ఏ నిర్ణయించగా, ఆ గ్రామంలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు 10 శాతం హెచ్‌ఆర్‌ఏ మాత్రమే అందుతోందన్నారు. రాజమహేంద్రవరం నగరానికి 8 కిలోమీటర్లలోపు ఉన్న ఈ గ్రామంలో పని చేసే ఉద్యోగులకు 16 శాతం హెచ్‌ఆర్‌ఏ వచ్చేలా చూడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనికి డీఆర్‌ఓ సానుకూలంగా స్పందించారు.

ప్రధాన రహదారులపై పశువుల హాగా

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పట్టణంలో ఓవర్‌బ్రిడ్జిపై తిష్ట వేసిన పశువులు

నిడదవోలు: పట్టణంలో ప్రధాన రహదారులపై పశువుల సంచారం ఎక్కువైంది. స్థానిక గణేష్‌చౌక్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి సెంటర్, సంత మార్కెట్, గణపతి సెంటర్ ఏరియాల్లో వాటి సంచారం ఎక్కువగా ఉంది. పశువుల యజమానులు వాటిని పగలు, రాత్రివేళల్లో విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. దీంతో పట్టణంలోని ప్రధాన సెంటర్లలో తిష్ట వేస్తున్నాయి. పశువుల యజమానులు నిర్లక్ష్యంగా వాటిని బయటకు వదలడంతో అవి గుంపులు గుంపులుగా సంచరించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్ల మధ్యలో అడ్డంగా ఉండడంతో వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. ఒక్కో సమయంలో పశువులను తప్పించబోయి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో ఊర్వశి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద పశువులు గుంపులుగా ఉండడంతో ద్విచక్ర వాహనదారుడు పశువులను దాటిస్తూ ప్రమాదానికి గురై గాయాలపాలయ్యాడు.

ప్రయాణికుల పాట్లు

ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రధాన రహదారులపై అడ్డంగా పశువులు ఉండడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు వాటి నితప్పించడానికి ప్రయత్నించి కింద పడిపోతున్నారు. పశువులను తప్పించుకుని వెళ్లడానికి హారన్ కొడుతున్నారు. ఆ సమయంలో పశువులు చెల్లా చెదురై ద్విచక్ర వాహనాలపై పడుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు కింద పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఇలా చాలాకాలంగా యజమానులు తమ పశువులను రోడ్లపై విడిచి పెడుతున్నా మున్సిపల్ అధికారులకు మాత్రం చీమకుట్టినట్లుగా ఉండడం లేదు. చాలాసార్లు పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

నోటీసులు ఇచ్చినా బేఖాతరు

పట్టణంలో నెహ్రూనగర్‌కు చెందిన కొందరి తాలూకా పశువులుగా మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చెబుతున్నారు. వీరికి ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా లెక్క చేయకుండా పశువులను ఇష్టం వచ్చినట్లుగా వదులుతున్నారు. గతేడాది రోడ్లపై సంచరిస్తున్న ఆవులను పట్టుకొని నిర్బంధించారు. అయినా యజమానులు వారి పద్ధతి మార్చుకోలేదు. పట్టణంలో సుమారు వందకు పైగా పశువులు సంచరించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పశువులను గో సంరక్షణ కేంద్రాలకు తరలించాలని పట్టణ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఉండ్రాజవరం: వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉండ్రాజవరంలో బౌద్ధధమ్మ పీఠం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 88 మందికి పరీక్షలు చేసి వారిలో 14 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించినట్లు సీనియర్ కంటి వైద్య నిపుణులు ఎస్‌కే.కరీం తెలిపారు. 30 మందికి కళ్లజోళ్లు, మిగిలిన వారికి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బౌద్ధ పీఠాధిపతి బంతె అనాలియో మాట్లాడుతూ రోగులకు అవసరమైన మందులు, శస్త్ర చికిత్సలు పూర్తిగా ఉచితంగా చేస్తారన్నారు. ప్రతి నెల మూడో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు డెంటల్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి కళారావు, ఎన్.చంటిబాబు, ఏ.మణికంఠ, ఆఫ్టీషియన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

దుర్గారావు కుటుంబానికి పరామర్శ



పైడిమెట్టలో దుర్గారావును పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా

తాళ్లపూడి: మండలంలోని పైడిమెట్ట గ్రామానికి చెందిన జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు దున్న దుర్గారావు తల్లి దున్నా వీరమ్మ ఇటీవల మృతి చెందారు. సోమవారం రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇతర నాయకులు దుర్గారావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు వనిమిరెడ్డి శ్రీను, నల్లాకుల వేణు, చేమకూరి సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆదిశేషు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం

నిడదవోలు: సంక్రాంతి సందర్భంగా యువత చెడు మార్గాల వైపునకు వెళ్లకుండా క్రీడా పోటీలు నిర్వహించటం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. జైభీమ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల్లో గెలిపొందిన విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ యువత చెడు సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బొచ్చా కృష్ణ తదితరులు పాల్గొన్నారు

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



గోపవరంలో క్రీడాకారులకు మెమెంటోలు, చెక్కులు అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు రూరల్: యువత చెడు వ్యసనాల వైపు దృష్టి సారించకుండా క్రీడల వైపు ఆసక్తి పెంచుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని గోపవరంలో సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, చిన నంగాలు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా జరిగిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విజేతలకు మంత్రి మెమెంటోలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, గొడ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగన సూర్యారావు, స్థానిక నాయకులు పంచదార దుర్గాప్రసాద్, జుజ్జవరపు గోపి, కోయి రమేష్, అడ్డగర్ల వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.